క్లుప్తంగా

దగదర్తి విద్యార్థికి బంగారు పతకం



బంగారు పతకంతో చల్లా వెంకట్‌నిఖిల్

కావలిరూరల్: గత రెండు రోజులుగా ఆత్మకూరులోని ప్రభుత్వ ఉన్నత పాఠశాల ఆవరణలో జరుగుతున్న రాష్ట్రస్థాయి నెట్‌బాల్ పోటీల్లో దగదర్తికి చెందిన చల్లా వెంకట్ నిఖిల్ ప్రతిభ కనబరచి బంగారు పతకం సాధించాడని దగదర్తి జెడ్పీ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయుడు సీహెచ్ వెంకటసుబ్బయ్య తెలిపారు. సోమవారం దగదర్తిలోని ఆ పాఠశాలలో హెచ్‌ఎం మాట్లాడుతూ తమ పాఠశాలలో 9వ తరగతి చదువుతున్న చల్లా వెంకట్‌నిఖిల్ చదువుతోపాటు క్రీడల్లోనూ రాణిస్తున్నాడని, తమ విద్యార్థి రాష్ట్రస్థాయిలో బంగారు పతకం సాధించడం సంతోషకరమని తెలిపారు. ఆదివారం ఆత్మకూరులో స్థానిక ఎమ్మెల్యే మేకపాటి విక్రమ్‌రెడ్డి చేతులమీదుగా వెంకట్‌నిఖిల్ బంగారు పతకం అందుకున్నాడని తెలిపారు. ఈ సందర్భంగా ఉపాధ్యాయులు, సహచర విద్యార్థులు సోమవారం ఆ పాఠశాలలో వెంకటనిఖిల్‌ను అభినందించారు.

డ్రైవింగ్‌లో మెళకువలు పాటించాలి



సదస్సులో మాట్లాడుతున్న ఎంవీఐ సుందరరావు

ఉదయగిరి: డ్రైవర్లు వాహనాలను నడిపే సమయంలో మెళకువలు పాటిస్తూ ప్రమాదాల నివారణకు కృషి చేయాలని కావలి డివిజన్ మోటర్ వెహికల్ ఇన్‌స్పెక్టర్(ఎంవీఐ) ఎం.సుందరరావు సూచించారు. సోమవారం స్థానిక ఆర్టీసీ డిపో గ్యారేజి ఆవరణలో జాతీయ రహదారి భద్రతా వారోత్సవాల్లో భాగంగా డ్రైవర్లకు ప్రమాదాల నివారణపై ఆయన అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఎంవీఐ మాట్లాడుతూ రోడ్డు ప్రమాదాలు ప్రధానంగా మానవ తప్పిదాలు, వాహన యాంత్రిక లోపం, పరిస్థితుల దృష్ట్యా జరుగుతుంటాయన్నారు. ఎక్కువగా మానవ తప్పిదాల వలనే జరుగుతున్నాయని, డ్రైవర్లు వాహనాలు నడిపేటప్పుడు ఇతర వ్యాపకాలపై దృష్టి మరల్చకుండా ఏకాగ్రతగా నడపాలని సూచించారు. ట్రాఫిక్ నిబంధనలు పాటించాలని, వాహన ధ్రువీకరణ పత్రాలు అందుబాటులో ఉంచుకోవాలని తెలిపారు. డిపో మేనేజర్ శ్రీనివాసరావు మాట్లాడుతూ డ్రైవర్లు బాధ్యతాయుతంగా వాహనాలను నడిపి ప్రయాణికులను క్షేమంగా గమ్యస్థానాలకు చేర్చాలన్నారు. ఉదయగిరి డిపోను ప్రమాదాల రహిత డిపోగా నిలిపేందుకు ప్రజా రవాణా ఉద్యోగులు, సిబ్బంది,అధికారులు కృషి చేయాలన్నారు. కార్యక్రమంలో ఎస్సై జి.అంకమ్మ, డిపో ఏడీసీ ఎం.వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

మాదక ద్రవ్యాలకు దూరంగా ఉండాలి

ఉదయగిరి: విద్యార్థులు మాదక ద్రవ్యాలు, మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలని స్పెషల్ ఎన్‌ఫోర్స్‌మెంట్ బ్యూరో ఎస్సైలు రవీంద్రబాబు, మురళీకృష్ణ సూచించారు. సోమవారం స్థానిక మేకపాటి రాజమోహన్‌రెడ్డి ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో విద్యార్థులకు మాదక ద్రవ్యాల వినియోగం వల్ల కలిగే అనర్థాలపై వారు అవగాహన సదస్సు నిర్వహించారు. విద్యార్థులు మత్తుపదార్థాలకు బానిస కావడం వల్ల జీవితం నాశనమవుతుందని తెలిపారు. సమాజంలో గౌరవం ఉండదన్నారు. చెడు వ్యసనాలకు యువత దూరంగా ఉండి క్రమశిక్షణతో చదువుకుని ఉన్నత స్థానాలకు చేరుకోవాలని సూచించారు. కార్యక్రమంలో కళాశాల ఇన్‌చార్జి ప్రిన్సిపల్ ఆకుల నరసింహారెడ్డి, సిబ్బంది రవిశంకర్, మీరామొహిద్దీన్, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

తప్పుడు రాతలు మానుకోవాలి

సంగం: ప్రతిపక్షనేత చంద్రబాబునాయుడికి తొత్తుగా వ్యవహరిస్తున్న పత్రిక తప్పుడు రాతలు మానుకోవాలని వైఎస్సార్‌సీపీ నేతలు హెచ్చరించారు. సంగం తహసీల్దార్ కార్యాలయం ఆవరణలో ఆదివారం మహాత్మాగాంధీ, అమరజీవి పొట్టిశ్రీరాములు విగ్రహావిష్కరణ కార్యక్రమాన్ని నిర్వహించగా శిలాఫలకంలో బీసీ వర్గానికి చెందిన ఎంపీటీసీ సభ్యుల పేర్లు వేయలేదంటూ ఆ పత్రికలో సోమవారం వచ్చిన కథనంపై సంగంకు చెందిన వైఎస్సార్‌సీపీ నేతలు స్పందిస్తూ విలేకరుల సమావేశం నిర్వహించారు. వైఎస్సార్‌సీపీ నాయకుడు కంటాబత్తిన రఘునాథరెడ్డి మాట్లాడుతూ సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి బీసీలకు ప్రత్యేక స్థానం కల్పించారన్న విషయాన్ని ఆ పత్రిక గుర్తించాలన్నారు. మరోసారి ఇలాంటి తప్పుడు కథనాలు ప్రచురిస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ పులగం శంఖర్‌రెడ్డి, నాయకులు బండి మోహన్, భాస్కర్, మైనారిటీ నేత జహంగీర్ తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వ స్థలం కబ్జా!

కొండాపురం: మండలంలోని మర్రిగుంట గ్రామంలో చెత్త నుంచి సంపద తయారీ కేంద్రం నిర్మాణానికి మండలస్థాయి అధికారులు, కోర్టు అనుమతులు ఇచ్చినా ఆ స్థలాన్ని కబ్జా చేసి నిర్మాణాన్ని అడ్డుకొంటున్నారని సర్పంచ్ దార్ల గోపి ఆరోపించారు. సోమవారం ఎన్‌ఆర్‌ఈజీఎస్ ఏపీఓ చెంచయ్యతో కలిసి సంపద తయారీ కేంద్రం నిర్మాణానికి ముగ్గుపోసేందుకు వెళ్లగా అదే గ్రామానికి చెందిన చినఅంకయ్య ఆ స్థలాన్ని దున్ని కబ్జా చేశారని గుర్తించినట్లు తెలిపారు. ఆ భూమి ప్రభుత్వానికి చెందిందని రెవెన్యూ అధికారులు అనుమతులిచ్చినా అడ్డుకొంటున్నారని తెలిపారు. అధికారులు స్పందించి చర్యలు తీసుకోవాలని కోరారు.

ప్రజా సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయం

• ఆత్మకూరు ఎమ్మెల్యే మేకపాటి విక్రమ్‌రెడ్డి



సమీక్ష సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే మేకపాటి విక్రమ్‌రెడ్డి

మర్రిపాడు: ప్రజా సంక్షేమమే రాష్ట్ర ప్రభుత్వ ధ్యేయమని ఆత్మకూరు ఎమ్మెల్యే మేకపాటి విక్రమ్‌రెడ్డి పేర్కొన్నారు. 'గడప గడపకు మన ప్రభుత్వం' కార్యక్రమం ద్వారా వచ్చిన అర్జీలపై మండలంలోని కంపసముద్రం గ్రామంలో సోమవారం ఎమ్మెల్యే సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి దేశంలో ఏ రాష్ట్రంలో అమలు చేయని విధంగా సంక్షేమ పథకాలు అమలు చేస్తున్నారని తెలిపారు. అర్హులైన పేదలందరికీ ప్రభుత్వ సంక్షేమ పథకాలు అందేలా సచివాలయ, వలంటీర్ వ్యవస్థలను ఏర్పాటు చేశారని తెలిపారు. వలంటీర్లు తమ పరిధిలోని 50 కుటుంబాలకు నిరంతరం మెరుగైన సేవలు అందిస్తున్నారని తెలిపారు. వలంటీర్లు ప్రజల సమస్యలను అధికారుల దృష్టికి తీసుకెళ్లి సత్వరమే పరిష్కరించాలని సూచించారు. అనంతరం ప్రతి అర్జీకి సంబంధించి లబ్ధిదారులను ప్రత్యేకంగా పిలిపించి మాట్లాడారు. అధికంగా రెవెన్యూ సమస్యలు ఉన్నాయని, ప్రతి సమస్యను అధికారులు వెంటనే పరిష్కరించాలని తెలిపారు. గ్రామాల అభివృద్ధికి గ్రామస్తులంతా ఐక్యంగా ఉండాలన్నారు. అంతేకాకుండా ఈ ప్రాంతంలో సాగునీటి సమస్య పరిష్కారం కోసం రిజర్వాయర్ కూడా నిర్మిస్తున్నామన్నారు. సోమశిల హైలెవల్ కెనాల్ పనుల్లో భాగంగా కంపసముద్రం వద్ద రిజర్వాయర్ నిర్మిస్తున్నామని తెలిపారు. రిజర్వాయర్ నిర్మాణం పూర్తయితే ఈ ప్రాంతమంతా సస్యశ్యామలం అవుతుందన్నారు. ప్రతి ఎకరాకు సాగునీరు అందిస్తామని తెలిపారు. కార్యక్రమంలో ఎంపీడీఓ నాగమణి, తహసీల్దార్ హేమంత్‌కుమార్, సర్పంచ్ వెంగయ్య, వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ బొర్రా సుబ్బిరెడ్డి, నాయకులు చెన్ను శ్రీధర్‌రెడ్డి, కృష్ణప్రసాద్‌రెడ్డి, నాయుడు హజరత్‌రెడ్డి, కాంతారెడ్డి, అశోక్‌రెడ్డి, సోమల మాధవరెడ్డి, లక్ష్మీనరసయ్య, నాగేశ్వరరావు, అన్ని శాఖల అధికారులు, ఎంపీటీసీ సభ్యులు, సర్పంచ్‌లు, ప్రజలు పాల్గొన్నారు.

ఉదయగిరి అభివృద్ధికి అన్నివిధాలా సహకారం

• సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డితో భేటీ సందర్భంగా ఎమ్మెల్యే మేకపాటికి హామీ



సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి పుష్పగుచ్ఛం అందజేస్తున్న ఎమ్మెల్యే మేకపాటి చంద్రశేఖర్‌రెడ్డి

ఉదయగిరి: జిల్లాలో వెనుకబడిన ఉదయగిరి మెట్ట ప్రాంత అభివృద్ధికి అన్నివిధాలా పూర్తి సహాయ సహకారాలు అందిస్తానని సీఎం జగన్‌మోహన్‌రెడ్డి ఎమ్మెల్యే మేకపాటి చంద్రశేఖర్‌రెడ్డికి హామీ ఇచ్చారు. తాడేపల్లిలోని సీఎం క్యాంపు కార్యాలయంలో సోమవారం ఎమ్మెల్యే మేకపాటి చంద్రశేఖర్‌రెడ్డి సీఎం జగన్‌మోహన్‌రెడ్డిని మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ నేపథ్యంలో ఎమ్మెల్యే ఉదయగిరి సమగ్ర అభివృద్ధి కార్యాచరణ ప్రణాళికకు సంబంధించి వినతిపత్రాన్ని సీఎం జగన్‌కు అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ముఖ్యంగా ఉదయగిరి ప్రాంతంలోని నిరుద్యోగ యువతకు ఉపాధి కల్పించేలా ఒక పరిశ్రమ ఏర్పాటు చేయాలని, పెద్దిరెడ్డిపల్లి రిజర్వాయర్‌ను సత్వరమే పూర్తిచేసి బీడు భూములను సస్యశ్యామలం చేయాలని కోరారు. ఈ రెండు అంశాలకు సంబంధించి దివంగత ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖరరెడ్డి గతంలో సానుకూలంగా స్పందించారని, వాటిని ప్రస్తుత సీఎంగా మీరే పూర్తి చేయాలని వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని ఎమ్మెల్యే మేకపాటి కోరారు. జిల్లా కేంద్రానికి అనుసంధానం చేసే నియోజకవర్గంలోని 300 కి.మీ. రోడ్ల అభివృద్ధికి నిధులు మంజూరు చేయాలని విన్నవించారు. దుత్తలూరు, వింజమూరు మండలాలకు సాగు, తాగు నీరందించే సోమశిల హైలెవెల్ కెనాల్ పూర్తిచేయాలని కోరారు. అలాగే ఉదయగిరిలో టూరిజం అభివృద్ధికి సహకరించాలని విజ్ఞప్తి చేశారు. కాగా సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి వచ్చే బడ్జెట్‌లో ఉదయగిరి నియోజకవర్గ అభివృద్ధికి నిధులు కేటాయిస్తామని హామీ ఇచ్చారని తెలిపారు. పెండింగ్‌లో ఉన్న పలు పనులు పూర్తయ్యేలా చర్యలు తీసుకుంటానని సీఎం తెలిపారన్నారు. ఉదయగిరి నియోజకవర్గంలోని ఎస్సీ, ఎస్టీ, బీసీలకు అసైన్‌మెంట్ భూములకు సంబంధించి పెండింగ్ సమస్యలను పరిష్కరించేలా కలెక్టర్‌కు ఆదేశాలిస్తామని హామీ ఇచ్చారని పేర్కొన్నారు. నేతలను సమన్వయం చేసుకోవాలని, మాజీ ఎంపీ మేకపాటి రాజమోహన్‌రెడ్డితో కలిసి సమస్యలను పరిష్కరించుకోవాలని సూచించినట్లు ఎమ్మెల్యే తెలిపారు. 'గడప గడపకు మన ప్రభుత్వం' కార్యక్రమాన్ని వేగవంతం చేయాలని సూచించారని తెలిపారు.

అర్హులందరికీ సంక్షేమ పథకాలు



సంక్షేమ పథకాల బుక్‌లెట్ మహిళకు అందజేస్తున్న ఎమ్మెల్యే ప్రతాప్‌కుమార్‌రెడ్డి

• కావలి ఎమ్మెల్యే ప్రతాప్‌కుమార్‌రెడ్డి

కావలి: రాష్ట్ర ప్రజల అభివృద్ధే ధ్యేయంగా అర్హులందరికీ సంక్షేమ పథకాలు అమలు చేస్తున్న ఘనత ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికే దక్కిందని ఎమ్మెల్యే రామిరెడ్డి ప్రతాప్‌కుమార్‌రెడ్డి అన్నారు. బోగోలు మండలం తాళ్లూరు గ్రామంలో సోమవారం 'గడప గడపకు మన ప్రభుత్వం' కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ కావలి నియోజకవర్గ ప్రజల సమస్యల పరిష్కారానికి తక్షణ చర్యలు తీసుకుంటున్నామని, రాష్ట్ర ప్రభుత్వం కులమతాలు, పార్టీలకు అతీతంగా అర్హులైన ప్రతి ఒక్కరికీ సంక్షేమ పథకాలు అందిస్తోందని తెలిపారు. గత ప్రభుత్వంలో జన్మభూమి కమిటీలతో కేవలం టీడీపీ నాయకులకు మాత్రమే లబ్ధి చేకూరేదని, విద్యార్థులు సర్టిఫికెట్ల కోసం, ప్రజలు రెవెన్యూ సమస్యల పరిష్కారం కోసం కాళ్లరిగేలా ప్రభుత్వ కార్యాలయాల చుట్టూ తిరిగినా ఫలితం ఉండేది కాదని గుర్తుచేశారు. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక గ్రామాల అభివృద్ధే లక్ష్యంగా ప్రతి గ్రామంలో ప్రజలకు అందుబాటులో ఉండేలా సచివాలయాలను ఏర్పాటు చేసి వలంటీర్ల ద్వారా లబ్ధిదారుల ఇంటి ముంగిటకే సంక్షేమ పథకాలు అందేలా సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి చర్యలు తీసుకున్నారని తెలిపారు. ఎన్నికల సమయంలో చెప్పిన పథకాలే కాకుండా మరెన్నో సంక్షేమ పథకాలు ప్రవేశపెట్టిన ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రజల హృదయాల్లో చిరస్థాయిగా నిలిచారని, ప్రస్తుతం ఏ గడపకు వెళ్లినా జై జగన్ జైజై జగన్ అంటూ ప్రజలు నీరాజనాలు పలుకుతున్నారని తెలిపారు. కార్యక్రమంలో ఎంపీటీసీ సభ్యులు, సర్పంచ్‌లు, వార్డు మెంబర్లు, పలు శాఖల అధికారులు, వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలు, ప్రజలు పాల్గొన్నారు.

ఎమ్మెల్యే పరామర్శ

అల్లూరు: స్థానిక వినాయకనగర్‌కు చెందిన వైఎస్సార్‌సీపీ నాయకులు పెనుమల్లి నిరంజన్‌రెడ్డి, ప్రతాప్‌రెడ్డి తండ్రి భాస్కర్‌రెడ్డి(74) ఇటీవల మృతిచెందిన నేపథ్యంలో సోమవారం ఎమ్మెల్యే రామిరెడ్డి ప్రతాప్‌కుమార్‌రెడ్డి వారి నివాసానికి వెళ్లి కుటుంబసభ్యులను పరామర్శించారు. ఎమ్మెల్యే వెంట వైఎస్సార్‌సీపీ నాయకులు మన్నెమాల సుకుమార్‌రెడ్డి, నీలం సాయికుమార్, ఊటు శ్రీకాంత్‌రెడ్డి, దైవాదీనం, షేక్ ఉస్మాన్ షరీఫ్, మధురెడ్డి, తాండ్ర మల్లికార్జున, నిమ్మల భాస్కర్, బత్తల సుధ, రసూల్ తదితరులు ఉన్నారు.

రోడ్డు భద్రతా నియమాలు పాటించాలి



అవగాహన ర్యాలీ నిర్వహిస్తున్న ఎంవీఐ, ఎస్సై, సిబ్బంది

చేజర్ల: వాహనదారులు రోడ్డు భద్రతా నియమాలను పాటించాలని ఆత్మకూరు మోటార్ వెహికల్ ఇన్‌స్పెక్టర్ రాములు, చేజర్ల ఎస్సై మరిడి నాయుడు సూచించారు. జాతీయ రోడ్డు భద్రతా వారోత్సవాల్లో భాగంగా సోమవారం చేజర్లలో మడపల్లి రోడ్డు నుంచి బస్టాండ్ వరకు అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ అధిక లోడుతో, అతి వేగంతో వెళితే ప్రమాదాలు జరుగుతాయన్నారు. ద్విచక్ర వాహనదారులు హెల్మెట్ తప్పనిసరిగా ధరించాలని, ఆటో డ్రైవర్లు పరిమితికి మించి ప్రయాణికులను ఎక్కించుకోరాదని సూచించారు.

వాటర్ ప్లాంట్ ప్రారంభం



వాటర్ ప్లాంట్‌ను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే విక్రమ్‌రెడ్డి

మర్రిపాడు: మండలంలోని శెట్టిసముద్రం గ్రామంలో నూతనంగా నిర్మించిన వాటర్ ప్లాంట్‌ను ఆత్మకూరు ఎమ్మెల్యే మేకపాటి విక్రమ్‌రెడ్డి సోమవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామంలో తాగునీటి సమస్య పరిష్కారం కోసం వాటర్ ప్లాంట్ ఎంతో ఉపయోగకరమన్నారు. వాటర్ ప్లాంట్‌ను గ్రామస్తులంతా సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ బొర్రా సుబ్బిరెడ్డి, ఎంపీటీసీ సభ్యులు అబ్దుల్లా, హజరత్‌రెడ్డి, సర్పంచ్ కృష్ణారెడ్డి, నాయకులు సూర్యప్రకాష్‌రెడ్డి, కృష్ణప్రసాద్‌రెడ్డి, గంగినేని రవీంద్రబాబు, శ్రీనివాసులు, ప్రతాప్‌రెడ్డి, కొండారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

పథకాల అమలుపై ప్రత్యేక దృష్టి



మాట్లాడుతున్న పంచాయతీ విస్తరణాధికారి వెలుగోటి మధు

కలిగిరి: సచివాలయ ఉద్యోగులు అర్హులైన ప్రతి ఒక్కరికీ ప్రభుత్వ సంక్షేమ పథకాలు అందించడంపై ప్రత్యేక దృష్టి పెట్టాలని పంచాయతీ విస్తరణాధికారి వెలుగోటి మధు తెలిపారు. మండలంలోని నాగసముద్రం గ్రామ సచివాలయంలో ఉద్యోగులతో సోమవారం ఆయన సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సచివాలయంలో అందజేసే ఏపీ సేవా సర్వీసులు, దిశ యాప్, బాల్యవివాహాల నిర్మూలన, నవరత్నాల పథకాలను గురించి ప్రజలకు అవగాహన కల్పించాలని తెలిపారు. రైతుభరోసా కేంద్రాల్లో సకాలంలో ఈ–క్రాప్ నమోదు చేయాలన్నారు.

అందుబాటులో వైద్యసేవలు

సంగం: ప్రతి ఒక్కరికీ వైద్యసేవలు అందుబాటులో ఉండాలనే ఉద్దేశంతో సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి గ్రామాల్లో వైఎస్సార్ విలేజ్ క్లినిక్‌ల ఏర్పాటుకు శ్రీకారం చుట్టారని వైఎస్సార్‌సీపీ నాయకుడు కంటాబత్తిన రఘునాథరెడ్డి తెలిపారు. సోమవారం సంగంలోని తిరుమణతిప్పలో వైఎస్సార్ విలేజ్ క్లినిక్ నిర్మాణానికి ఆయన శంకుస్థాపన చేశారు. ఆయన వెంట నాయకుడు జనార్దన్‌రెడ్డి తదితరులు ఉన్నారు.

రోగులకు మెరుగైన వైద్యసేవలు

• కలెక్టర్ చక్రధర్‌బాబు



మాట్లాడుతున్న కలెక్టర్ చక్రధర్‌బాబు

నెల్లూరు(అర్బన్): రోగులకు అవసరమైన సదుపాయాలు కల్పిస్తూ మెరుగైన వైద్యసేవలందించాలని కలెక్టర్ కేవీఎన్ చక్రధర్‌బాబు ఆదేశించారు. నెల్లూరులోని క్యాంప్ కార్యాలయంలో ఆత్మకూరు జిల్లా ఆస్పత్రి అభివృద్ధి కమిటీ సమావేశాన్ని సోమవారం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ఓపీ స్లిప్‌లకు సంబంధించి ఒక కాపీని రోగులకు ఇవ్వాలని సూచించారు. డాక్టర్లు, సిబ్బంది, మందుల వివరాలు తెలిపే బోర్డులు ఏర్పాటు చేయాలని ఆదేశించారు. డ్యూటీ డాక్టర్లు సెలవులో ఉంటే ఆ వివరాలను కూడా ప్రదర్శించాలన్నారు. ఆత్మకూరు జిల్లా ఆస్పత్రి ఎదుట బస్‌షెల్టర్ ఏర్పాటు చేసేందుకు ఒక స్వచ్ఛంద సంస్థ ముందుకొచ్చిందని అందువల్ల స్థలాన్ని కేటాయించాలని మున్సిపల్ కమిషనర్‌ను ఆదేశించారు. సమావేశంలో డీసీహెచ్‌ఎస్ డాక్టర్ రమేష్‌నాథ్, డీఎంహెచ్‌ఓ పెంచలయ్య, ఆత్మకూరు జిల్లా ఆస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ శేషారత్నం, ఆర్‌ఎంఓ ఉషాసుందరి, సివిల్ సర్జన్ మునికృష్ణ, కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

అలుపెరుగని పోరాట యోధుడు నేతాజీ



కావలిరూరల్: నేతాజీ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పిస్తున్న దృశ్యం



అనుమసముద్రంపేట: జెడ్పీ ఉన్నత పాఠశాలలో..

కావలిరూరల్: స్వాతంత్రోద్యమంలో అలుపెరుగని పోరాటం చేసిన యోధుడు నేతాజీ సుభాష్ చంద్రబోస్ అని ప్రభుత్వ క్షేత్ర విభాగ అధికారి నాగసాయి సూరి తెలిపారు. కావలి పట్టణంలోని ముసునూరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో సోమవారం నేతాజీ సుభాష్ చంద్రబోస్ జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. నేతాజీ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సంద్భంగా వక్తలు మాట్లాడుతూ దేశం కోసం నేతాజీ చేసిన పోరాటాలను విద్యార్థులకు వివరించారు. కార్యక్రమంలో సీడబ్ల్యూసీ చైర్‌పర్సన్ మాధవి, రామ్‌సెంటర్ చైర్మన్ డి.మనోహర్‌రెడ్డి, డైరెక్టర్ తాతిరెడ్డి, సామాజిక కార్యకర్త ఎం.మాలకొండారెడ్డి, ప్రధానోపాధ్యాయుడు నాగేశ్వరరావు, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

నేతాజీ విగ్రహావిష్కరణ

వరికుంటపాడు: మండలంలోని రామాపురం పంచాయతీ కాకొల్లువారిపల్లె జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఆ పాఠశాల పూర్వ విద్యార్థి, న్యాయవాది కె.మల్లికార్జుననాయుడు ఏర్పాటు చేసిన స్వాతంత్య్ర సమర యోధుడు, ఆజాద్ హింద్ ఫౌజ్ వ్యవస్థాపకులు నేతాజీ సుభాష్ చంద్రబోస్ నూతన విగ్రహాన్ని ఆయన జయంతి సందర్భంగా సోమవారం సర్పంచ్ ఆర్.పెంచలమ్మ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వక్తలు మాట్లాడుతూ నేతాజీ చేసిన పోరాటాలను ప్రతి ఒక్కరూ స్మరించుకోవాలన్నారు. కార్యక్రమంలో హెచ్‌ఎం బాలభాస్కర్, తల్లిదండ్రుల కమిటీ చైర్మన్ శ్రీనివాసులు, గ్రామస్తులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ఘన నివాళి

అనుమసముద్రంపేట: స్థానిక జెడ్పీ ఉన్నత పాఠశాలలో సోమవారం నేతాజీ సుభాష్ చంద్రబోస్ జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. నేతాజీ చిత్రపటానికి హెచ్‌ఎం హమీద్ తదితరులు పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో విద్యార్థులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

పాఠశాలల్లో..

ఆత్మకూరు: స్వాతంత్య్ర సమరయోధుడు నేతాజీ సుభాష్ చంద్రబోస్ జయంతి సందర్భంగా సోమవారం పట్టణంలోని ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలల్లో, అంగన్‌వాడీ కేంద్రాల్లో ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి ఘన నివాళులర్పించారు. ఎల్‌ఆర్ పల్లి అంగన్‌వాడీ కేంద్రంలో చిన్నారులతో నేతాజీపై రాసిన పాటలను పాడించారు.

గ్రంథాలయంలో..

సంగం: స్థానిక శాఖ గ్రంథాలయంలో సోమవారం నేతాజీ సుభాష్ చంద్రబోస్ జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. తొలుత నేతాజీ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం పలువురు ఉపాధ్యాయులు మాట్లాడుతూ స్వాతంత్రోద్యమంలో నేతాజీ చేసిన పోరాటాలను విద్యార్థులకు వివరించారు. కార్యక్రమంలో గణిత ఉపాధ్యాయులు వేలూరు మాల్యాద్రి, గ్రంథాలయాధికారి రవీంద్రనాథ్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.



వరికుంటపాడు: విగ్రహాన్ని ఆవిష్కరిస్తున్న సర్పంచ్ పెంచలమ్మ తదితరులు



ఆత్మకూరు: ఎల్‌ఆర్‌పల్లి అంగన్‌వాడీ కేంద్రంలో..

ప్రమాదాల నివారణకు చర్యలు



డ్రైవర్‌తో ముఖం కడిగిస్తున్న పోలీసులు

ఆత్మకూరు: రోడ్డు ప్రమాదాల నివారణకు జిల్లా పోలీసు ఉన్నతాధికారుల సూచనలతో పలు చర్యలు చేపడుతున్నట్లు ఆత్మకూరు ఎస్సై ఎం.శివశంకరరావు తెలిపారు. ఆదివారం అర్ధరాత్రి ఆత్మకూరు మున్సిపల్ పరిధిలోని నెల్లూరు – ముంబై 67వ నంబరు జాతీయ రహదారిపై వాహనాల డ్రైవర్లకు ఫేస్ వాష్ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రమాదాల నివారణలో భాగంగా అర్ధరాత్రి 1.30 గంటల నుంచి 3 గంటల మధ్యలో జాతీయ రహదారులపై వాహనాలను నిలిపి డ్రైవర్లకు ఫేస్ వాష్ కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఆ సమయం నిద్ర అధికం వచ్చే సమయం కావడంతో నిద్ర తప్పించేందుకు డ్రైవర్లు ముఖం కడుక్కొని తిరిగి వాహనాలు నడిపితే ఎలాంటి ప్రమాదాలు జరగకుండా ఉంటాయని ఈ చర్యలు చేపట్టామన్నారు. ఆయన వెంట పోలీసు సిబ్బంది ఉన్నారు.

అప్రమత్తతతో ప్రమాదాల నివారణ

కలిగిరి: వాహనచోదకులు అప్రమత్తంగా ఉంటే ప్రమాదాలను నివారించవచ్చని కావలి మోటర్ వెహికల్ ఇన్‌స్పెక్టర్ ఆర్.సుందరరావు తెలిపారు. కలిగిరిలోని ఇన్‌ఫాంట్ జీసస్ ఇంగ్లిష్ మీడియం స్కూల్‌లో 34వ జాతీయ రహదారి భద్రతా వారోత్సవాల్లో భాగంగా సోమవారం విద్యార్థులకు రోడ్డు భద్రతా నియమాలపై అవగాహన సదస్సు నిర్వహించారు. పిల్లలు వాహనాలు నడపరాదన్నారు. ఎక్కడైనా రోడ్డు ప్రమాదాలు జరిగితే పోలీసులకు, 108 అంబులెన్స్‌కు సమాచారం అందించాలని తెలిపారు. కార్యక్రమంలో ఎస్సై కరుణాకర్, కరస్పాండెంట్ విష్ణువర్ధన్‌రెడ్డి, సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

మృతుడి కుటుంబానికి ఆర్థికసాయం



నగదు అందజేస్తున్న చిరంజీవిరెడ్డి

కలిగిరి: రోడ్డు ప్రమాదంలో మృతిచెందిన యువకుడు వాకాటి వెంకటేష్ కుటుంబసభ్యులకు ఏపీ స్టేట్ పోలీస్ హౌసింగ్ కార్పొరేషన్ చైర్మన్ మెట్టుకూరు చిరంజీవిరెడ్డి సోమవారం కలిగిరిలో ఆర్థికసాయం అందజేశారు. కలిగిరిలో ఎంపీడీఓ కార్యాలయం ఎదుట నివాసం ఉండే వెంకటేష్ కుటుంబసభ్యులు చిరంజీవిరెడ్డిని కలిసి ఉత్తరక్రియలకు సాయం చేయాలని కోరారు. స్పందించిన ఆయన రూ.10 వేల ఆర్థికసాయం అందజేశారు. ఆయన వెంట క్రాకుటూరు ఎంపీటీసీ సభ్యుడు హరిశ్చంద్రారెడ్డి, సర్పంచ్‌లు వెంకటసుబ్బయ్య, సుబ్బనాయుడు, మల్లికార్జున్‌రెడ్డి, నాయకులు వెంకి, సతీష్, కొండారెడ్డి, అంకిరెడ్డి తదితరులు ఉన్నారు.

ఇంటి పన్ను వసూలుపై దృష్టి సారించాలి



మాట్లాడుతున్న డీఎల్‌పీఓ ఆదినారాయణ

వరికుంటపాడు: మండలంలోని పంచాయతీ కార్యదర్శులు ఇంటి పన్ను బకాయిల వసూలుపై ప్రత్యేక దృష్టి సారించాలని కావలి ఇన్‌చార్జి డీఎల్‌పీఓ ఆదినారాయణ సూచించారు. సోమవారం స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో ఆయన పంచాయతీ కార్యదర్శులతో సమావేశం నిర్వహించారు. ఫిబ్రవరి చివరి నాటికి ఇంటి పన్నులు నూరు శాతం వసూలు చేయాలన్నారు. పంచాయతీల్లో అవసరమైన నిధులు అందుబాటులో ఉంచుకుని అభివృద్ధి పనులు చేపట్టడంతోపాటు మౌలిక వసతులు కల్పించాలన్నారు. పంచాయతీల్లో చెత్త నుంచి సంపద తయారీ కేంద్రాలను ఉపయోగంలోకి తీసుకువచ్చి వర్మీకంపోస్టు తయారు చేయాలని, ఆ ఎరువును రైతులకు విక్రయించి పంచాయతీ ఆదాయాన్ని పెంపొందించుకోవాలని సూచించారు. అంతకుముందు ఆయన మండలంలోని నల్లబోతులవారిపల్లె కాలనీలో వివాదాస్పదంగా ఉన్న కోళ్లఫాం నిర్మాణాన్ని పరిశీలించి విచారణ జరిపారు. సమావేశంలో ఎంపీడీఓ విజయభాస్కరరావు, ఈఓపీఆర్డీ సురేష్‌బాబు తదితరులు పాల్గొన్నారు.

ప్రణాళికతో చదివితే ఉత్తమ ఫలితాలు



కలిగిరి: కేజీబీవీలో ఉపాధ్యాయులతో మాట్లాడుతున్న జీసీడీఓ మమత

అనుమసముద్రంపేట: విద్యార్థులు ప్రణాళికతో చదివితే ఉత్తమ ఫలితాలు సాధించవచ్చని బాలికా శిశు అభివృద్ధి అధికారి(జీసీడీఓ) టి.మమత అన్నారు. ఏఎస్‌పేటలోని కస్తూర్బా గాంధీ బాలికల విద్యాలయాన్ని సోమవారం ఆమె ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా వంటగదిని, స్టోర్‌రూంను పరిశీలించారు. అనంతరం విద్యార్థులు, ఉపాధ్యాయులతో మాట్లాడుతూ మరో 60 రోజుల్లో 10వ తరగతి పరీక్షలు జరగనున్న నేపథ్యంలో నూటికి నూరుశాతం మార్కులు వచ్చేలా ప్రతి విద్యార్థిని ఉపాధ్యాయులు సిద్ధం చేయాలని సూచించారు. పదో తరగతి, ఇంటర్మీడియట్ విద్యార్థుల పట్ల శ్రద్ధ తీసుకుని ప్రత్యేక బోధన చేయాలని తెలిపారు. అనంతరం నేతాజీ సుభాష్ చంద్రబోస్ జయంతి వేడుకల్లో పాల్గొని స్వాతంత్రోద్యమంలో నేతాజీ చేసిన పోరాటాలను విద్యార్థులకు వివరించారు. కార్యక్రమంలో ప్రిన్సిపల్ బి.శ్రీలక్ష్మి, ఉపాధ్యాయులు, సిబ్బంది పాల్గొన్నారు.

జీసీడీఓ సందర్శన

కలిగిరి: స్థానిక కస్తూరీబా గాంధీ బాలికల విద్యాలయాన్ని బాలికా శిశు అభివృద్ధి అధికారి (జీసీడీఓ) మమత సోమవారం సందర్శించారు. వసతి గృహంలో భోజనం నాణ్యతను పరిశీలించారు. ఉపాధ్యాయులతో పలు విషయాలపై చర్చించారు. అనంతరం 10వ తరగతి విద్యార్థినులకు, ఉపాధ్యాయులకు పలు సూచనలు అందించారు.